క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వీసీబీ ట్రిప్పింగ్ సర్క్యూట్ మరమ్మతులకు గురైంది. దీంతో బేస్తవారిపేట, సోమవారిపేట, చింతలపాలెం, నేకునాంబాద్, ఒందుట్ల, చెట్టిచర్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ లేకపోవడంతో రైతులు, ఇతర వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



డీఐని సన్మానిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

మార్కాపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణిని శనివారం తన కార్యాలయంలో పట్టణ మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి బాలు, కోశాధికారి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభం



పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభిస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్లు

కంభం: నిత్యం రద్దీగా ఉండే కందులాపురం కూడలిలో పబ్లిక్ టాయిలెట్స్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని) పేర్కొన్నారు. స్థానిక కందులాపురం కూడలిలో సచివాలయం పక్కన పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను శనివారం సర్పంచ్ ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, రైల్వేస్టేషన్ సమీపంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడకుండా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సునీత, పంచాయతీ వార్డు మెంబర్లు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

సమస్యలతో శివార్

- కాలనీల్లో మౌలిక వసతులు మృగ్యం
- డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగు
- అంతర్గత రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించని పాలకులు



భగత్‌సింగ్ కాలనీలో రోడ్డుపై చేరిన మురుగు

మార్కాపురం:

మార్కాపురం పట్టణంలోని శివారు కాలనీలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ కష్టాలు తీరుతాయని 8 నెలల నుంచి ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పేద ప్రజలు ఎక్కువగా ఉండే భగత్‌సింగ్ కాలనీ, విద్యానగర్, చెన్నకేశవ నగర్, 11వ వార్డు, పూలసుబ్బయ్య కాలనీ తదితర కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా నగర్, భగత్ సింగ్ కాలనీ, 11వ వార్డు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలుస్తోంది. వర్షాకాలం వస్తే ఈ ప్రాంతంలో రోడ్డు మీద తిరగడం కూడా కష్టంగా మారింది. పలుచోట్ల మట్టిరోడ్డు ఉండటంతో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. ఇక ఇళ్లలో నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో రోడ్ల పైనే ఉండి దుర్వాసన వస్తోంది. ఈ పరిణామాలు దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఎగుడు దిగుడు రోడ్లపై రాత్రి వేళ వెళ్లే క్రమంలో పలువురు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలయ్యారు. మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని ఆయా కాలనీల ప్రజలు ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టినప్పటికీ కొన్నింటిని రద్దు చేయడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

రోడ్లు వేసి డ్రైనేజీ నిర్మించాలి



పట్టణంలోని చెన్నకేశవనగర్, 11వ వార్డు తదితర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు సిమెంటు రోడ్లు వేసి డ్రైనేజీ నిర్మించాలి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. వారు స్పందించి రోడ్లు వేయాలని కోరుతున్నాం. మురుగు ముందుకు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో ఇళ్ల మధ్యే నిల్వ ఉంటోంది. కాలనీ వాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– ఉత్తమ్‌కుమార్, 11 వార్డు నివాసి



11వ వార్డులో ఉన్న మట్టి రోడ్డు



విద్యా నగర్‌లో డ్రైనేజీలేని మట్టిరోడ్డు

సమాజంలో స్త్రీ పాత్ర కీలకం



గిద్దలూరు : మాట్లాడుతున్న జడ్జి ఓంకార్

గిద్దలూరు రూరల్: సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో కీలకమైనదని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరూ కనీస ధర్మంగా భావించాలన్నారు. ఎక్కడ స్త్రీ గౌరవింపబడుతుందో అక్కడ సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. స్త్రీలు శారీరకంగా బలహీనంగా ఉన్నప్పటికీ వారి మేధా శక్తి ఎంతో గొప్పదన్నారు. అనంతరం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో మొత్తం 133 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శేషశయనారెడ్డి, ఆనందకుమార్, హిమశేఖర్‌రెడ్డి, బి.రాజ్‌కుమార్, ఎం.రంగారెడ్డి, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- మార్కాపురం ఏడీజే శుభవాణి



మాట్లాడుతున్న ఏడీజే శుభవాణి

మార్కాపురం టౌన్: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం చేకూరుతుందని, ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శుభవాణి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. మొత్తం 734 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఇందుకోసం 3 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం శుభవాణి, సీనియర్ సివిల్‌జడ్జి బి దేవేందర్‌రెడ్డి, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి జె.కిశోర్‌కుమార్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు బి.కాశయ్య, షేక్ బేగం, కరీమున్నీసా, వెలుగొండయ్య, అశోక్‌నాయక్, జహీర్ సాలమ్, ఝాన్సీరాణి సభ్యులుగా వ్యవహరించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



గిద్దలూరు : పిచ్చయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న ఫారెస్ట్ డీడీ నిషాకుమారి

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు, ఇటీవల రాష్ట్ర ఉత్తమ అవార్డుకు ఎంపికైన మొర్రిపిచ్చయ్యయాదవ్‌ను గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గిద్దలూరులోని గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుడి పాత్రకు ఎంతో విశిష్ట గౌరవం ఉందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడిని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను గ్రంథపాలకులు, ఉపాధ్యాయులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ డీఈఓ కాశీశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు మంజురేఖ, తదితరులు పాల్గొన్నారు.

దుంపా రమణమ్మను సన్మానించిన బత్తుల



దుంపా రమణమ్మ, చెంచిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు బడుగు ఇందిర, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు ప్రసన్న, మహిళా నాయకురాలు భూమిరెడ్డి రమణమ్మ, మహిళా విభాగం సంతనూతలపాడు మండల అధ్యక్షురాలు ఎం.సీతమ్మ, ఎంపీపీ పి.విజయ, వైస్ ఎంపీపీ పి.రాఘవమ్మ, మద్దులూరు సర్పంచ్ వి.శైలజ, సంతనూతలపాడు ప్రెసిడెంట్ వి.నాగమణి, వేములపాడు సర్పంచ్ విజయలక్ష్మి, రాధా, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వాహనం ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారి, నిత్యం ట్రాఫిక్ ఉండే మహలక్ష్మమ్మ గుడి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఇనుప విద్యుత్ స్తంభాన్ని తరచూ వాహనాలు ఢీకొట్టడంతో క్రమంగా దెబ్బతింటూ వచ్చింది. ఒక పర్యాయం స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం నుంచి విద్యుత్ సిబ్బంది రూ.7 వేలు వసూలు చేశారని స్థానికులు చెబుతున్నారు. అయితే శనివారం కూడా మరో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మరింత ప్రమాదకరంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



డాక్టర్ ప్రియదర్శినిని సన్మానిస్తున్న మాజీ మంత్రి సురేష్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ సతీష్



కొమరోలు : కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ రేవతి

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్
- మహిళా దినోత్సవం సందర్భంగా పలువురికి సన్మానం

మార్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మార్కాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జార్జి ఫార్మసి కళాశాలలో డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఏ1 గ్లోబల్‌ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ పాల్గొని పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సుధీర ప్రియదర్శినిని మాజీ మంత్రి సురేష్ ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో పలువురు మహిళా ప్రముఖులు పాల్గొని కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మసూద్ తదితరులు పాల్గొన్నారు. లయోలా పబ్లిక్ స్కూల్లో వైఎస్సార్ సీపీ నేత లయోలా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మిస్ తెలంగాణ దీప్తి, డాక్టర్ అన్నా స్ఫూర్తి, ఇన్‌చార్జి ఎస్‌టీఓ రత్నకుమారి, వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వరలక్ష్మి, మాజీ ఎంపీపీ పి.అరుణ తదితరులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు ఆర్‌జేడీ డాక్టర్ ఎ.వీరారెడ్డి, జెడ్పీ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జార్జి ఫార్మసి కళాశాలలో డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భముగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా డీసీఓ డి.జయ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అడకమిక్ డీన్ డాక్టర్ సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్నివాల్‌లో నిర్వహించిన వేడుకల్లో విజేతలకు డాక్టర్ సతీష్ బహుమతులు అందజేశారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ వై.రేవతి కేక్ కట్ చేసి ఉపాధ్యాయినులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పొదిలి: స్థానిక పెన్షనర్ల భవనంలో యూనియన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి డి.దానమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పది మంది మహిళా పెన్షనర్లను సన్మానించారు. ప్రధాన కార్యదర్శి మదార్‌వలి 'మహిళా జన్మకు వందనం' అనే కవితను ఆలపించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎ.బాదుల్లా, ఎ.వీరారెడ్డి, సుబ్బారావు, మోహనరావు, డీఎల్.నరసింహారావు, దుర్గావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో యూటీఎఫ్ నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. శోభ మాట్లాడుతూ ఆయా రంగాల్లో మహిళలు విజయం సాధిస్తున్న విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాల వెంకటేశ్వర్లు, అబ్దుల్‌హై, నాసర్‌మహ్మద్, బూదాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ విద్యా సంస్థల్లో..

స్థానిక బిట్స్ విద్యా సంస్థల్లో సంస్థ డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు సమాన హక్కులు, అవకాశాలు పొందే క్రమంలో చట్టాలు మాత్రమే కాకుండా సామాజిక మనస్తత్వంలో కూడా మార్పు రావాలన్నారు. ముందుగా కేక్ కట్ చేసి పరస్పరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎస్.నాయుడు, టి.శ్రీనివాసరావు, మెహరాన్, లక్ష్మీ కుమారి, కిరణ్మయి, స్వప్న, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ సమితి ఆధ్వర్యంలో..

సమితి అధ్యక్షుడు ధర్నాసి రామారావు ఆధ్వర్యంలో ఎస్‌వీ గార్డెన్‌లో వేడుకలు జరిగాయి. సమితి ఉపాధ్యక్షురాలు అపర్ణ, ఉప కార్యదర్శి షకీలా, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి అనూరాధ, ఆసిఫా తదితరులను సన్మానించారు. ఆయా రంగాల్లో వారు అందిస్తున్న సేవలను రామారావు కొనియాడారు. కార్యక్రమంలో షా, కరీముల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.



పొదిలి : పెన్షనర్లను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు



పొదిలి : యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న శోభ

ఆంధ్రకేసరి యూనివర్శిటీకి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్ జీ

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒంగోలులో ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి యూనివర్శిటీ నిర్మాణ పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని మల్లయ్యలింగం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్శిటీలో అన్ని విభాగాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికీ ఆ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే మంత్రి లోకేష్ తన మాట నిలుపుకోవాలని కోరారు. జీవో నంబర్ 77 రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. డిగ్రీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు పవన్ కళ్యాణ్, రామాంజి, సురేంద్ర, చరణ్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com